# అన్నదమ్ములు

వేమారపువారు కామారపువారు అన్నదమ్ముల కుటుంబీకులు. మొదట అంతా ఒకింట్లోనే ఉండి ఒకే వంటవండుకుని పంచుకు తినే వారు. తర్వాత జీవనాలు గడవక, జీవనాధారాలు వెతుక్కుంటూ చెరో దిక్కూ వెళ్ళిపోయారు. ఆ దిక్కుల పెరిగి పెద్దవాళ్ళయి పెళ్ళిళ్లు చేసికొని తండ్రులయి, తాతలయి తామరతంపరగా వంశవృక్షాలు పెంచుకున్నారు.

ఆపైన కొంత కాలానికి వేమారపువారు కామారపువారు మన మంతా ఒక వేరుపిల్లలమని గుర్తించి తిరిగివచ్చి కలుసుకున్నారు. తర తరాల బాంధవ్యాలు పెళ్ళగించుకుని కావలించుకున్నారు. రక్తసంబం ధాలు గుర్తుకుతెచ్చుకుని పొంగిపోయారు. ఆనందమయంగా పండుగ చేసికొంటున్న సమయంలో వేమారపువారికి పిల్లనిచ్చిన పెద్దమనిషి పాయసం తాగుతూ 'అన్నదమ్ములు అన్నదమ్ములు! అంటున్నారు. ఇంతకూ ఎవరు అన్న? ఎవరు తమ్ముడు?' అన్నాడు. పాయసం పూర్తి చేసిన కామారపువారి వియ్యంకుడు 'కామారపువారే పెద్దవారు. వాళ్ళే అన్న' అన్నాడు. 'ఛత్! వేమారపువారు చిన్నా? తమ్ముడా?' అంటూ పాయసం గ్లాసు నేలకు కొట్టాడు వేమారపువారి వియ్యంకుడు.

'ఆ! మహా చెప్పావ్! నీకేంతెల్సు కామారపువారి గొప్పతనం! ఆ ఐశ్వర్యం ఆ హోదా... వారి కిందచెయ్యే మీ దెప్పుడైనా' అన్నాడు కామా. వి.

సత్యం శంకరమంచి

'ఓ హోశ్ ! ఈ బడాయి తెలియందా! కుత్సితపువంశం! ఆస్తి అంతా కాజేసి వేమారపువార్ని తన్ని తగలేసింది మీరుకదూ ?' అన్నాడు వేమా. వి.

'తగూలమారి వంశం ఎక్కడికి పోతుంది ? నోరుపెట్టుకు అరిచి ఆస్తి గుంజుకుపోయింది కాక పైగా తరిమేశారంటావ్ ? తప్పుడు మాటలు...' అంటూ లేచాడు కామా. వి.

'మా మోచేతికింద నీళ్ళుతాగినవాళ్ళు మా వంశాన్ని వేలెట్టి చూపటమా ? చీరేస్తాను' అంటూ నడుంబిగించాడు వేమా. వి.

'అంత పౌరుషం ఉందా పల్లి జాతివెధవా.'

'హోయ్ ! ఏం కూశావ్ ! కుక్కలకొడకా.'

కామారపువారు వేమారపువారు గగ్గోలుగా లేచి కలియబడ్డారు. చెంపలు ఛెళ్ళునమోగాయి. ధన్‌ధన్‌మని గుద్దుకున్నారు. కర్రా, చెప్పా, చేదా తీసుకు బాదుకున్నారు. ఆడవాళ్ళు గొల్లుమన్నారు. పిల్లలు కెవ్వుమని ఏడ్చారు. వండినపాయసం నేలమీద ఒలికిపోయింది. సీరసం వచ్చేవరకూ తన్నుకుని అరుచుకున్నారు.

ఛ ! ఒక్క క్షణం ఇక్కడ ఉండకూడదనుకుని ఎవరిమూటలు వాళ్ళు కట్టుకుని చెరోదిక్కు ప్రయాణమైనారు. దాచుకున్న ప్రేమల్ని. పెన వేసుకోలేకపోయిన ఆప్యాయతల్ని బరువుగా గుండెల్లో నింపుకుని ఆడ వాళ్ళు వారి మొగవాళ్ళ వెనక నడుస్తుంటే, తల్లుల బుజాలమీంచి పసిపాపలు వెనక్కితిరిగి అప్పటిదాకా ఆడుకుని మరోదిక్కుకు పోతున్న పాపలవైపు బోసినవ్వులు నవ్వుతూ చేతులూపుతున్నారు.